



రోడ్డు పక్కన నిలిపేసిన పేపర్‌లోడ్ లారీలు

లోడింగ్ పాయింట్లు పెంచాలి

- లారీ అసోసియేషన్ సభ్యుల డిమాండ్
- మెట్టు దిగని జేకే యాజమాన్యం
- పేరుకపోయిన 4000టన్నుల ఉత్పత్తి
- రోడ్లపైనే సరుకుతో లారీలు

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 6: కాగజ్‌నగర్ ఎస్పీఎం జేకే యాజమాన్యం, లారీ అసోసియేషన్ మధ్య లోడింగ్ వివాదం రాజుకుంది. మిల్లులో ఉత్పత్తి చేసిన కాగితాన్ని దేశంలోని ఢిల్లీ, పంజాబ్, హర్యాన, హైదరాబాద్, కేరళ, చెన్నై తదితర రాష్ట్రాలకు జేకే యాజమాన్యం లారీల్లో ఎగుమతి చేస్తోంది. కాగజ్‌నగర్ లారీ అసోసియేషన్ ద్వారా కాకుండా ఇతర బడా ట్రాన్స్‌పోర్టర్స్ సహాయంతో వివిధ లారీల్లో ఎగుమతి చేస్తుండటంతో తమకు పూర్తిగా అన్యాయం జరుగుతోందని స్థానిక లారీ అసోసియేషన్ సభ్యులు సమ్మె బాట పట్టారు. గతంలో పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ కేవలం 14లోడింగ్ పాయింట్లను ఇచ్చారు. ప్రస్తుతం మిల్లులో ఉత్పత్తి అధికంగా ఉండగా, బడా ట్రాన్స్‌పోర్టర్లతో ఎక్కువ లోడ్‌లను ఎగుమతి చేయిస్తున్నారు. దీంతో తమకు తక్కువ లోడింగ్ వస్తున్నాయని ఇక్కడి లారీ అసోసియేషన్ సభ్యుల వాదన. తమకు కూడా వందశాతం లోడింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. జేకే యాజమాన్యం మాత్రం గతంలో ఇచ్చిన ఒప్పందం ప్రకారమే ఇస్తున్నామని, కొత్తగా తామేమీ ఇవ్వటానికి వీలు కాదని పేర్కొంటోంది. దీంతో సమస్య రోజురోజుకు క్లిష్టంగా మారుతోంది. ప్రస్తుతం మిల్లులో నుంచి కాగజ్‌నగర్ లారీ అసోసియేషన్ ద్వారా లోడింగ్ చేసిన లారీలన్నింటిని రోడ్డుపైనే నిలిపివేశారు. మిల్లులో 4000 టన్నుల ఉత్పత్తి పేరుకపోయింది. వీటితో పాటు తమకు పెరిగిన ధరలకు అనుగుణంగా కిరాయి ధరలు పెంచాలని కోరుతూ పలుమార్లు లారీ అసోసియేషన్ సభ్యులు, జేకే యాజమాన్యం దృష్టికి తీసుకుపోయినప్పటికీ ఇంతవరకు పరిష్కారం కాలేదు. ఈసారి ఎలాగైనా మిల్లు యాజమాన్యంతో అమీతుమీ తేల్చుకునేందుకు లారీ అసోసియేషన్ సభ్యులు నిశ్చయించుకున్నారు. పరిస్థితులు అదుపుతప్పుతున్నట్లు భావించిన యాజమాన్యం అదనపు పోలీసు బలగాలతో పహారా కాస్తున్నారు. లారీ అసోసియేషన్, చెక్‌పోస్టు సమీపంలో, బస్టాండు వద్ద పోలీసులు గట్టి బందో నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారులు వెంటనే చొరవతీసుకొని జేకే యాజమాన్యం, లారీ అసోసియేషన్ సభ్యులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని అంతా కోరుతున్నారు.

మిల్లు యాజమాన్యం స్పందించడం లేదు..
-కిషోర్ బాబు, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు

మిల్లు యాజమాన్యం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించటం లేదు. మిల్లులో పూర్తి లోడింగ్ తమకు ఇవ్వకుండా బడా ట్రాన్స్‌పోర్టర్లకు అప్పగిస్తున్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నాం. ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకపోయినప్పటికీ పట్టించుకోవటం లేదు. సమస్యను పరిష్కరించాలని జిల్లా అధికారులతో పాటు స్థానిక అధికారులకు కూడా వినతిపత్రాలను అందజేశాం. అయినా జేకే యాజమాన్యం స్పందించకపోవటంతో మిల్లులో ఉత్పత్తి చేసిన కాగితపు లోడ్‌లారీలను ఎక్కడికక్కడే నిలిపివేశాం. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు శాంతియుత వాతావరణంలో పోరాటం చేస్తాం.

సమస్యను వెంటనే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, అక్టోబరు 6: ఎస్పీఎం యాజమాన్యం లారీ అసోసియేషన్ సభ్యుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ సిర్పూరు ఇన్‌చార్జీ లెండుగురే శ్యాంరావు అన్నారు. ఆదివారం లారీ అసోసియేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడి కిషోర్‌బాబుతో కాసేపు మాట్లాడారు. పోరాటానికి పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. జేకే యాజమాన్యం మొండివైఖరి అలంభిస్తోందన్నారు. లారీ అసోసియేషన్ సభ్యులు లారీలు సమకూర్చేందుకు వీలుండగా, బడా ట్రాన్స్‌పోర్టర్లతో చేతులు కలిపి ఇక్కడి అసోసియేషన్ సభ్యులకు అన్యాయం చేస్తున్నారన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మోహిన్ మాట్లాడుతూ లారీ అసోసియేషన్ సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు నక్క మనోహర్, దాసరి వెంకటేష్ పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్‌బాబు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, అక్టోబరు 6: ఎమ్మెల్యే హరీష్‌బాబు స్థానికసలోటే నివాసంలో ఏర్పాటుచేసిన సత్యనారాయణస్వామి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు తివారి, సౌరబ్, ధాత్రక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

బెజ్జూరు: మండలంలోని కుంటలమానేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చాకటివిజయ్ అత్త భీంబాయి మృతిచెందడంతో ఆదివారం ఎమ్మెల్యే పాల్వాయిహరీష్‌బాబు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు



కాగజ్‌నగర్ పార్కులైన్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం

కాగజ్‌నగర్, అక్టోబరు 6: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవరోజు ఆదివారం కాగజ్‌నగర్, రెబ్బెనలో అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చిం ది. ఈ సందర్భంగా దుర్గామాత మంపాల వద్ద భక్తులు పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండలి కమిటీ సభ్యులు, భక్తులు, రెబ్బెనలో సింగరేణి జీఎం శ్రీనివాస్, తహసీల్దార్ రాంమోహన్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకు ద్వితీయస్థానం



ద్వితీయస్థానంలో నిలిచిన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు

రెబ్బెన, అక్టోబరు 6: అంతర్‌జిల్లా బాల్‌బాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ద్వితీయస్థానం లభించిందని ఆదిలాబాద్ బాల్ బాడ్మింటన్ ప్రధానకార్యదర్శి ఆర్ నారాయణరెడ్డి తెలిపారు. 69వ రాష్ట్రస్థాయి అండర్-19పోటీలు కామారెడ్డిలో జరిగిన ఈపోటీల్లో ఉమ్మడిఆదిలాబాద్ జట్టు ఫైనల్ పోటీల్లో రంగారెడ్డి జట్టుపై ఓడి ద్వితీయస్థానం సాధించినట్టు తెలిపారు. ద్వితీయస్థానం రావటంపై ఆదిలాబాద్ బాల్‌బాడ్మింటన్ అధ్యక్షుడు నర్సింగం, రాష్ట్ర బాల్ బాడ్మింటన్ సంయుక్త అధికారి ఎస్ తిరుపతి, నాయకులు ఉమ్మడిఆదిలాబాద్ జట్టును అభినందించారు.

బాధిత మహిళకు అండగా ఉంటాం: మంత్రి

ఆసిఫాబాద్, అక్టోబరు 6: జైనూరు బాధితురాలికి అండగా ఉంటామని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పూర్తి చేసుకుని వెళ్తున్నక్రమంలో ఆసిఫాబాద్ జిల్లాకాంగ్రెస్ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, కాంగ్రెస్‌నాయకురాలు ఆత్రంసుగుణతో కలిసి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆమెకు రూ.20వేల ఆర్థికసాయంతో పాటు బట్టలు అందజేసి ఆసుపత్రి నుంచి డిశ్చార్జీ అయిన తరువాత ప్రత్యేక వాహనంలో పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో సాధారణ పరిస్థితి నెలకొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

గుడుంబా తయారు చేస్తున్న వ్యక్తి పట్టివేత

తిర్యాణి, అక్టోబరు 6: మండలంలోని చింతపల్లి గ్రామంలో ఇంట్లో గుడుంబాను తయారుచేస్తున్న పున్నం అనే వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు. పున్నం కొన్నిరోజులుగా ఇంట్లోనే గుడుంబా తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఇంట్లోకి వెళ్లి సోదాలు చేశామన్నారు. పున్నం గుడుంబా తయారు చేస్తూ కనిపించడంతో వెంటనే అతన్ని పట్టుకుని తయారీకి ఉపయోగించే సామాగ్రిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

వాంకిడి, అక్టోబరు 6: మండలంలోని కోమటిగూడ గ్రామసమీపంలో చేనులో ఆదివారం విద్యుత్‌మోటారుకు కనెక్షన్ ఇస్తున్నక్రమంలో అదే గ్రామానికి చెందిన వడ్డైరమేష్ విద్యుదాఘాతంతో చేతికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డై రమేష్ గ్రామ సమీపంలోని తనచేనులో విద్యుత్‌కనెక్షన్ ఇచ్చేందుకు లైన్‌మెన్ ద్వారా ఎల్సీ తీసుకున్నాడు. మోటారు ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్‌తీగలు కలుపుతున్న సమయంలో అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురైచేతికి గాయాలయ్యాయి. వెంటనే బంధువులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. కాగా లైన్‌మెన్ నిర్లక్ష్యం వల్లనే రమేష్ విద్యుదాఘాతానికి గురైనట్లు అతని బంధువులు ఆరోపించారు. ఈ విషయమై ఏఈ శ్రీకాంత్‌ను సంప్రదించగా ఆయన అందుబాటులో లేడు.

నలుగురిపై కేసు నమోదు

దహెగాం, అక్టోబరు 6: మండలంలోని గిరివెల్లి ఎర్రవాగు సమీపంలో అక్రమంగా పశువులు తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆదివారం కన్నెపల్లి మండలం చింతపుడి లింగాల గ్రామానికి చెందిన ఎండీ అహ్మద్, నాయిని శ్రీనివాస్, నాయిని సంజీవ్, గంట శంకర్ లారీలో తరలిస్తున్న 26పశువులను పట్టుకుని స్వాధీన పర్చుకుని కాగజ్‌నగర్‌గోశాలకు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

కౌటాల, అక్టోబరు 6: కౌటాల మండలం సాండ్‌గాం గ్రామానికిచెందిన ఖోబ్రగడే మనోహర్(28) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మనోహర్‌కు ఏడు సంవత్సరాల క్రితం వివాహం కాగా అతని భార్య కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చికిత్స కోసం డబ్బులు లేక పోవడంతో మనస్థాపానికి గురై మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

కమ్ముకున్న పొంగమంచు



ఉదయం కురుస్తున్న పొగమంచు

దహెగాం, అక్టోబరు 6: మండలవ్యాప్తంగా ఆదివారం ఉదయం 8గంటల వరకు పొగమంచు కమ్ముకుంది. రహదారులపై వెళ్లే ప్రయాణికులు లైట్లువేసుకుని నడపాల్సివచ్చింది. పొగమంచుతో పత్తి, కూరగాయలపంటలకు నష్టంవాటిల్లుతుందని వ్యవసాయశాఖాధి కారులు తెలిపారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 6: గ్రామకార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట సోమవారం తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మోరేష్, ప్రధాన కార్యదర్శిశ్రీకాంత్ ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. జీపీ సిబ్బందికి నాలుగు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని సుప్రీంకోర్టు జీవో ప్రకారం కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దుచేసి, కారోబార్‌లను బిల్‌కలెక్టర్‌కు ప్రత్యేకస్టేటస్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆదివాసీ కొలావార్ సేవాసంఘం ఎన్నికలు

చింతలమానేపల్లి, అక్టోబరు 6: మండలంలో కొలావార్(మన్నెవార్) సేవాసంఘం కార్యవర్గం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు సుంకె కిష్టయ్య, రాష్ట్రఅధ్యక్షుడు బుర్సపోచయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రామయ్య, అధ్యక్షుడిగా శంకర్, వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా భగవాన్, ఉపాధ్యక్షులుగా రమేష్,రవి, ప్రచారకార్యదర్శిగా సదయ్య, సహాయ కార్యదర్శిగా భిక్షపతి, సంయుక్తకార్యదర్శిగా సురేష్, సాంస్కృతిక కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా శంకర్‌ను ఎన్నుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మేజిస్ట్రేట్

సిర్పూర్(టి), అక్టోబరు 6: మండలకేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన ఉత్సవాల్లో సిర్పూర్(టి)కోర్టు మేజిస్ట్రేట్ అజయ్ పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. శేషవాహనంపై వెంకటేశ్వరస్వామి ఊరే గింపులో పల్లకీని మోశారు. భక్తులు అడుగడు గునా హారతులుఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిపాటలు భజనల మధ్య పల్లకీయాత్ర కొనసాగింది.

పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

చింతలమానేపల్లి, అక్టోబరు 6: బీజేపీ సభ్యత్వ నమోదు చివరి అంకంలో ఉండడంతో కార్యకర్తలు పెద్దఎత్తున సభ్యత్వనమోదు చేయించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం మండలకేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. వచ్చే పదిరోజుల్లో కార్యకర్తలందరూ పెద్దఎత్తున సభ్యత్వ నమోదును ముందకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దోని శ్రీశైలం, మనోహర్‌గౌడ్, మల్లయ్య, తిరుపతి గౌడ్, నానయ్య, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వనమోదులో పాలు పంచుకోవాలి

పెంచికలపేట/దహెగాం: బీజేపీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలు క్రీయాశీలకంగా పాల్గొనాలని బీజేపీజిల్లాఅధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పెంచికలపేట, దహెగాం మండలకేంద్రాల్లో పార్టీ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బూత్‌స్థాయి నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. బీజేపీబలోపేతానికి కృషి చేయాలన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో, లోకల్ ఎన్నికల్లో ప్రతిఒక్కదానిపై ఈసభ్యత్వ నమోదుప్రబావం చూపుతుందని సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రచారి, నాగేష్, భుజంగరావు, రాజన్న, భీమన్న, కాంతారావు, ప్రభాకర్, హరీష్,శంకర్, షైమద్,సంతోష్, బాపూజీ, రాకేష్, గణపతి, నానయ్య,ప్రభాకర్, హరీష్, పోశణ్ణ, సుధాకర్, సంతోష్, వెంకన్న, వెంకటేశం, మహేష్, రాపర్తి ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

బెజ్జూరు, అక్టోబరు 6: ఏజెన్సీ ప్రాంత భూసమస్యల పరిష్కారా నికి ఐటీడీఏ అధికా రులకు, జిల్లాపాలన అధికారులకు ఏజెన్సీ భూసమస్యల అధికా రాలు అప్పగించిన హైకోర్టు తీర్మాణానికి నిరసనగా ఈనెల7న ఉట్నూరు ఐటీడీఏ ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కొలావార్ మన్నేవార్ సేవాసంఘం మండలాధ్యక్షుడు సతీష్ కోరారు. ఆదివారం స్థానికంగా ఆయనమాట్లాడారు. జిల్లాలోని 9ఆదివాసీ తెగల పెద్దలు, రాయిసెంటర్, తుడుందెబ్బ సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు వెంకటేష్, పుల్లయ్య, ఎం వెంకటేష్, గొంతు పాల్గొన్నారు.

పోచమ్మకు బోనాలు

బెజ్జూరు, అక్టోబరు 6: వర్షాలుకురిసి సమృద్ధిగా పంటుల పండాలని గ్రామస్థులు పోచమ్మకు బోనాలను సమర్పించారు. ఆదివారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో మహిళలు బోనాలను తలపై పెట్టికుని శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పోచమ్మ ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షణలు చేసి బోనాలను సమర్పించారు.

మహిళా చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆశాలత

కాగజ్‌నగర్, అక్టోబరు 6: మహిళా చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం(ఐద్వా) కేంద్రకమిటీ సభ్యురాలు ఆశాలత అన్నారు. ఆదివారం బాలభారతి పాఠశాలలో మొదటి మహాసభ ఏర్పాటు చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు చేస్తున్నట్టు చెబుతున్నప్పటికీ అమలుకు నోచుకోవటం లేదన్నారు. అనంతరం వివిధ సమస్యలపై భవిష్యత్తులో చేపట్టే కార్యచరణపై పలు అంశాలు తీర్మాణించారు. ఈ సందర్భంగా సీనియర్ సభ్యులు మమతా రాణా జెండాను అవిష్కరించారు. కార్య క్రమంలో ఐద్వాసభ్యులు, నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, కోటశ్రీనివాస్, కృష్ణమాచారి పాల్గొన్నారు.

జిల్లా కమిటీ: ఐద్వా జిల్లాకమిటీ ఏర్పాటైంది. అధ్యక్షురాలుగా మాచర్ల వినోద, కార్యదర్శిగా దుర్గం అనిత, కోశాధికారిగా ముంజం సుధారాణితో పాటు ఎనిమిది మంది సభ్యులను ఎన్నుకున్నారు.

పాఠశాలలో మరమ్మతులు

సిర్పూర్(టి), అక్టోబరు 6: మండలకేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమపాఠశాలలో గతనెల 30న రాత్రి కలెక్టర్ వెంకటేష్ దోత్రే బసచేసిన విషయం విదితమే. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు వసతిగృహంలో ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా, ఫ్యాన్‌లు, రక్షిత మంచినీటిపైపులైన్, మరుగుదొడ్లకు మరమ్మ తులు చేపట్టాలని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ మేరకు కలెక్టర్ మరమ్మతు పనులకు నిధులు కేటాయించి ఐటీడీఏ డీఈ నిరంజన్, ఏటీడబ్ల్యూవో ఖాదర్ హుస్సేన్‌కు ఆదేశాలు జారీచేశారు. దీంతో ఆదివారం నుంచి పనులు ప్రారంభించారు. దసరా సెలవులు పూర్తై పాఠశాలలు పునఃప్రారంభంలోగా పనులు పూర్తి చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు రవీందర్, హెచ్‌డబ్ల్యూఎస్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

బెయిల్‌పై విడుదలైన వారికి ఆర్థికసాయం

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 6: జైనూరు ఘటనలో అరెస్టై బెయిల్‌పై విడుదలైన 30మందికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ వ్యక్తిగత నిధుల నుంచి పదివేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. సహాయానికి చెందిన చెక్కులను బీజేపీ నాయకుడు సతీష్‌బాబు, బీజేవైఎం నాయకుడు సుచిత్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ 30మందిలో 27మందికి కరీంనగర్‌జైలు నుంచి విడుదల కాగా వారికి మంత్రి నేరుగా చెక్కులు అందజేశారని మిగితా ముగ్గురు ఆసిఫాబాద్ జిల్లా సబ్‌జైలు నుంచి విడుదలకాగా వారికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రావణ్‌గౌడ్, సంజీవ్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి లాభాల వాటాలో కార్మికులకు అన్యాయం



లాభాల వాటాపై తప్పుడు ప్రచారం చేస్తున్న సంఘాలు

మందమర్రిటౌన్, అక్టోబరు 6: కార్మికులకు 2023-24ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండు రోజుల్లో చెల్లించనున్న లాభాల వాటాపై కొన్ని కార్మికసంఘాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఇది సరియైన పద్ధతి కాదని ఏఐటీయూసీ రాష్ట్రఅధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వాస్తవ లాభాన్ని, స్థూలలాభాన్ని వెల్లడించినా తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ వాస్తవలాభాలు వెల్లడించలేదని, ఇప్పటికైనా కార్మిక సంఘాలు కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మాట్లాడితే మంచిదన్నారు.

నూతన పింఛన్ చెల్లించాలి

మందమర్రిటౌన్, అక్టోబరు 6: సింగరేణిలో ఉద్యోగ విరమణపొందిన రిటైర్డు కార్మికులకు నూతన 11వ వేజ్‌బోర్డు పింఛన్ అమలు చేయాలని రిటైర్డు కార్మికసంఘం నాయకులు వాసాలశంకర్, కొమురయ్య, రాజయ్య, రాజనర్సు పేర్కొన్నారు. ఆదివారం మందమర్రిలో వారు మాట్లాడుతూ రిటైర్డు కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు. 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన పింఛన్ అమలు చేసి ,ఏరియర్స్‌చెల్లించడం ద్వారా రిటైర్డు కార్మికులకు కొంత ఊరట ఉంటుందన్నారు. సమావేశంలో కొమురయ్య, సర్జన్, ఎల్లారం, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 6: సింగరేణి కార్మికులకు లాభాల బోనస్ వాటా కేటాయింపులో అన్యాయంజరిగిందని ఆదివారం గోదావరిఖనిలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. దీక్షలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, నాయకుడు విజిత్‌రావులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు మాజీఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసిపాల్గొన్నారు. సంస్థకు రూ.4,701 కోట్లనికరలాభం రాగా సంస్థ విస్తరణ, పెట్టుబడులకు రూ.2,289 కోట్లను కేటాయించగా మిగిలిన రూ 2,412కోట్లలో 33శాతం రూ.796కోట్లను మాత్రమే కార్మికులకు బోనస్‌గా ప్రకటించారని ఆరోపించారు. ప్రభుత్వం కార్మికులకు 16.9శాతం మాత్రమే లాభాల బోనస్‌ను చెల్లించిందంటూ ఆవేదన వ్యక్తంచేశారు. రూ.4,701 కోట్లలో కార్మికులకు చెందాల్సిన 33 శాతం లాభాల బోనస్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కుమరంభీం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు చందర్, పుట్ట మధు పాల్గొన్నారు.

వేదిక, టెంట్లు తొలగించిన పోలీసులు

గోదావరిఖని: గోదావరిఖని చౌరస్తాలో తలపెట్టిన బీఆర్ఎస్, టీబీజీకేఎస్ శిబిరాన్ని పోలీసులు తొలగించారు. దీక్షకు అనుమతి లేదని, అక్కడ వేసిన టెంట్లను, వేదికను పోలీసులు బలవంతంగా తొలగించారు. బీఆర్ఎస్, టీబీజీకేఎస్ శ్రేణులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అరగంటపాటు రెండు వర్గాల మధ్య నినాదాలు, తోపులాటలు చోటు చేసుకున్నాయి. టెంట్లను, వేదికను పోలీసులు తొలగించడంతో ఇదే నిరసన దీక్షను పక్కనే టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయ ఆవరణలో కొనసాగించారు. ఈ సంఘటన ఉద్రిక్తత వాతావరణాన్ని నెలకొల్పింది.

ప్రమాదకరంగా పెద్దవాగు అప్రోచ్ రోడ్డు



పెద్దవాగు వంతెన వద్ద కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు

పెంచికలపేట, అక్టోబరు 6: పెంచికలపేట- దహెగాం మండలాల మధ్య ఉన్న పెద్దవాగుపై నూతనంగా వంతెన నిర్మించినప్పటికీ అప్రోచ్‌రోడ్డు పూర్తి కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్రోచ్ రోడ్డు గతంలో కురిసిన వర్షాలకు దెబ్బతిని మీటరులోతు గుంతలు ఏర్పడి అత్యంత ప్రమాద కరంగా మారింది. వాహనాలు దగ్గరికి వెళ్లే వరకు కూడా గుంతలు కనపడడం లేదు. పరిస్థితి ఇంత ప్రమాదకరంగా ఉన్నా మరమ్మ తులు కూడా చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు గుంతల వద్ద కనీసం ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయడం లేదని ప్రజలు, ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సింగరేణికి భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

శ్రీరాంపూర్, అక్టోబరు 6: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సింగరేణికి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి, కాంట్రాక్టు, రిటైర్డ్ కార్మికుల ఆత్మీయ సదస్సు శ్రీరాంపూర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కంటే సింగరేణి కార్మికులకు మెరుగైన లాభాల వాటా ఇప్పించామన్నారు. అందులో భాగంగా కాంట్రాక్టు కార్మికులకు సైతం రూ.5 వేలు అందించేందుకు కృషి చేశామన్నారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పిస్తామన్నారు. రిటైర్డ్ కార్మికులకు సైతం తెల్లరేషన్ కార్డులు ఇప్పిస్తామని, అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. సింగరేణిలో ప్రభుత్వ జోక్యం పెరిగిందని కొన్ని యూనియన్లు ఆరోపణలు గుప్పిస్తున్నాయని, కానీ ప్రభుత్వ సహకారం లేనిదే ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణి మనుగడ సాగించలేదన్నారు. ఈ విషయంపై అవగాహన లేని యూనియన్లు ప్రభుత్వాన్ని తప్పుపట్టడం సరికాదన్నారు. కార్మికుల సంక్షేమం దృష్ట్యా తాము సంస్థను ఎల్లవేళలా కాపాడుతామని హామీ ఇచ్చారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, కనీస వేతనాల బోర్డు చైర్మన్, జేబీసీసీఐ సభ్యుడు బి.జనక్‌ప్రసాద్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. యూనియన్, ప్రభుత్వం కార్మికులకు చేస్తున్న సేవలను తెలిపారు. ఏరియా ఉపాధ్యక్షుడు జె. శంకర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్‌కు చెందిన సీనియర్ నాయకులు, ఏరియా నాయకులు ధర్మపురి, నర్సింహారెడ్డి, గరిగె స్వామి, భీంరావు పాల్గొన్నారు.

సింగరేణి తవ్విన గుంతలో పడి
బాలుడి మృతి



రాజ్‌కుమార్ (ఫైల్)

భీమారం(జైపూర్), అక్టోబరు 6: జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన చిప్పకుర్తి రాజ్‌కుమార్(15) ప్రమాదవశాత్తు ఆదివారం సింగరేణి సంస్థ తీసిన గుంతలో పడి మృతి చెందాడు. సింగరేణి పవర్ ప్లాంట్ కోసం బొగ్గు సరఫరా చేసేందుకు రైల్వే ట్రాక్ నిర్మాణానికి చుట్టు పక్కల గ్రామాల్లో మట్టి తవ్వకాలు జరిపారు. అనంతరం గుంతను పూడ్చలేదు. రాజ్‌కుమార్ తండ్రి విష్ణువర్ధన్ గ్రామ శివారులో పశువులు మేపుతున్నాడు. తండ్రికి భోజనం తీసుకుని గుంత పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా కాలు జారి గుంతలో పడ్డాడు. స్థానికులు గమనించి గుంతలో నుంచి బయటకు తీయగా అప్పటికే రాజ్‌కుమార్ మృతిచెందాడు. సింగరేణి యాజమాన్యం మట్టి తీసిన ప్రాంతంలో నిర్లక్ష్యంగా గుంతలు పూడ్చకపోవడంతోనే తన కుమారుడు మృతిచెంది ఉంటాడని మృతుడి తండ్రి విష్ణువర్ధన్ పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం తమ కుటుంబానికి న్యాయం చేయాలని పేర్కొన్నాడు. కాంగ్రెస్ నాయకులు ఫయాజుద్దీన్, వెంకటేష్, ప్రశాంత్, నర్సయ్యలు సంఘటన స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పరిశీలించారు. సింగరేణి యాజమాన్యం బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయాన్ని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి దృష్టికి తీసుకువెళ్లారు. జైపూర్ ఎస్ఐ శ్రీధర్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

వాలీబాల్ క్రీడలు ప్రారంభం

బెజ్జూరు, అక్టోబరు 6: మండలంలోని సోమిని గ్రామంలో నిర్వహిస్తున్న కుమరంభీం వాలీబాల్ పోటీలను టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్, మాజీ జడ్పీటీసీ పుష్పలత ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఓంప్రకాష్, సాయి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట యువతి బైఠాయింపు

నెన్నెల, అక్టోబరు 6: ప్రేమ పేరిట మోసం చేశాడని ప్రియుడి ఇంటి ఎదుట గిరిజన యువతి బైఠాయించింది. గొళ్లపల్లి గ్రామానికి చెందిన రేచబోయిన రాజశేఖర్ తనను మోసం చేశాడంటూ మైలారం గ్రామానికి చెందిన జంబి అంజలి ఆదివారం ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించింది. రెండు సంవత్సరాలుగా తనతో ప్రేమ సాగించి పెళ్లి ప్రస్తావన ఎత్తే సరికి ముఖం చాటేశాడని చెప్పింది. ఇన్నాళ్లు మాయమాటలు చెప్పి తనను శారీరకంగా లోబర్చుకున్నాడని పేర్కొంది. కులం అడ్డు రావడంతో పెళ్లికి ఒప్పుకోవడం లేదని, పెళ్లి చేసుకునేంత వరకు ఇంటి ఎదుట నుంచి కదిలేది లేదని భీష్మించుకొని కూర్చుంది. అంజలి ఆందోళన చేస్తుండటంతో రాజశేఖర్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్ళిపోయారు.

మెడికల్ సీటు సాధించిన విద్యార్థినులకు సన్మానం



ప్రసన్న, నాగమణిని సన్మానిస్తున్న నాయకులు

తాండూర్, అక్టోబరు 6 : తాండూర్ గ్రామానికి చెందిన శంకర్ కూతురు ప్రసన్న ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా ఆదివారం మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్, ముస్కె సాగర్, సత్యం, ఆదివాసీ మండల ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు విష్ణు కళ్యాణ్, రఘు, రవి, సంతోష్, అరుణ్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని గల్ఫ్ కార్మికుడు దుమల్ల ఎల్లయ్య కుమార్తె నాగమణి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో ఆదివారం తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఉద్యమ నాయకులు నాగమణిని సన్మానించారు. నాయకులు అంజయ్య, ఖాదర్‌ఖాన్, రమేష్‌గౌడ్, శ్రీనివాస్, చంద్రమౌళిగౌడ్, తిరుపతి, రవి, కలీమ్, హబీబ్,శేఖర్, సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి



వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజెక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి



కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ముద్దా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

హనుమకొండ జిల్లాలోని ఓ పత్తి చేనులో దుర్ఘటన .. ఇంటర్ విద్యార్థిని, యువ రైతు మరణం



రాజుయాదవ్



శ్రావణి (ఫైల్)

ఐనవోలు/నెల్లికుదురు/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురువగా.. పిడుగుపాటు వల్ల హనుమకొండ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురానికి చెందిన కుకట్ల రాజుయాదవ్ (25) దౌతుబాజి శ్రావణి(17), కుకట్ల కోమల(రాజుయాదవ్ తల్లి) సహా ఏడుగురు కలిసి గ్రామ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరుతున్నారు. అయితే, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడడంతో అందరూ సమీపంలోని ఓ రేకుల షెడ్డు కిందకి వెళ్లారు. పది నిమిషాల వ్యవధిలో ఆ షెడ్డుపై పిడుగుపడగా అంతా స్పృహ కోల్పోయారు. కాసేపటికి తేరుకున్న కొందరు ఇతరులను లేపేందుకు ప్రయత్నించగా రాజుయాదవ్, శ్రావణి ప్రాణాలు కోల్పోయారు. రాజుయాదవ్ తల్లి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. యువ రైతు అయిన రాజు అవివాహితుడు. ఇక, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆర్.సింగారం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సింగారం స్వస్థలం తమిళనాడులోని వెల్లూరు.. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగారం పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జనగాం, హనుమకొండ, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, జనగాం, వరంగల్, యాదాద్రి జిల్లాలకు సోమవారం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, ఆదివారం జనగామలో 3 సెంటీమీటర్ల వర్షపాతం కురవగా, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
సోమవారం 7 అక్టోబరు 2024





ఫుడ్ జోన్‌కు కేటాయించిన స్థలం

ఫుడ్ జోన్ పూర్తయ్యేదెన్నడు..?



ఫుడ్‌జోన్‌కు కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన రహదారి

- నాలుగేండ్లుగా నత్తనడకన నిర్మాణ పనులు
- పరిశ్రమల స్థాపనకు ముందుకు రాని వ్యాపారులు
- అందుబాటులోకి వస్తే పలువురికి ఉపాధి అవకాశాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

బెల్లంపల్లి, అక్టోబరు 6: ఫుడ్ జోన్ ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాలుగేండ్ల క్రితం బెల్లంపల్లికి ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ మంజూరైంది. దీంతో స్థానికులు, జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుతో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతోపాటు పలువురికి ఉపాధి అవకాశాలతోపాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశించారు. మంజూరై నాలుగేండ్లు అయినా పనులు పూర్తిస్థాయిలో కాకపోవడం, మరో వైపు పరిశ్రమల స్థాపనకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అందుబాటులోకి వస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందు తుందని పలువురు ఎదురు చూస్తున్నారు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● నత్తనడకన పనులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌ను బెల్లంపల్లిలో ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉండడంతో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల వెనుక సర్వే నెంబరు 170లో 350 ఎకరాల స్థలాన్ని సంబంధిత అధికారులు కేటాయించారు. ఈ స్థలంలో పరిశ్రమల కోసం రహదారులు, వంతెనలు నాణ్యతతో నిర్మించకపోవడంతో వర్షాకాలంలో వరదలకు రహదారులు, వంతెనలు కొట్టుకుపోయాయి. అనంతరం దాదాపు రూ.50 కోట్ల నిధులతో ఫుడ్ జోన్‌ల ఏర్పాటు చేసే పరిశ్రమలకు 100 ఫీట్ల రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుతోపాటు వివిధ నిర్మాణ పనులను సైతం చేపట్టారు. పరిశ్రమల కోసం చేసిన పనులే మళ్లీ మళ్లీ చేయడంతో నిధులు నీళ్ల పాలు కావడంతోపాటు మరో వైపు సమయం వృథా అయ్యింది. పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే ఫుడ్‌జోన్ ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాల్సి ఉంటుంది. దీంతోపాటు డ్రైనేజీలు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. పరిశ్రమల కోసం నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను శుద్ధి చేసే ప్లాంటుతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణకు అనువైన షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు ఇందులో ఒక్క పని కూడా పూర్తి కాలేదు. ఇలా నాలుగేండ్లుగా నామమాత్రంగానే ఫుడ్‌జోన్‌కు సంబంధిం చిన పనులు నడుస్తున్నాయి.

● వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా...

జిల్లాలో రైతులు పండించే పంటల ఉత్ప త్తుల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌ను మొదట ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. జిల్లాలో ఎక్కువగా రైతులు వరి, పత్తి, పప్పు దినుసులు, మామిడి సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ పంటలకు అనుగుణంగా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో రైతులు ఉత్పత్తి చేసిన పంటలతో స్థానికంగానే ఆహార ఉత్పత్తి జరగనుంది. రైతులు పండించిన పంటలను ఫుడ్‌జోన్‌లో ఏర్పడే పరిశ్రమలకు తర లించి ఆహార ఉత్పత్తులను తయారు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఫుడ్‌జోన్ అందుబాటులోకి రాకపోవడంతో స్థానికంగా పండించిన పంటలను ఇతర ప్రాంతాలకు రైతులు తరలిస్తున్నారు. ఫుడ్‌జోన్‌ను త్వరగా అందుబాటులోకి తెస్తే స్థానిక రైతులతో పాటు పక్కనున్న జిల్లా రైతులకు మేలు జరుగుతుంది.

● పరిశ్రమల స్థాపనకు ముందుకు రాని వైనం...

పట్టణంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌జోన్‌లో పరిశ్రమల ఏర్పాటుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. పరిశ్రమల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు సంబంధించి ప్రక్రియ ప్రారంభించినప్పటికీ ఎవరు ముందుకు రావడం లేదు. రైసుమిల్లులతోపాటు బియ్యం వినియోగించి తయారుచేసే ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలు, పప్పు ధాన్యాల ఉత్పత్తులు, సోయాబీన్, జిన్నింగ్ మిల్లు ఇతర పరిశ్రమలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ద్వారా పరిశ్రమల స్థాపనకు అవకాశం కల్పించినప్పటికీ ఇద్దరు మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రాకపోవడం, పనులు సైతం నత్తనడకన నడుస్తుండడంతో ఫుడ్ జోన్‌పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. పరిశ్రమలు ఏర్పాటైతే స్థానికులతో పాటు ఇతర ప్రాంతల వారికి ఎంతో మందికి ఉపాధి సైతం కలుగనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఫుడ్ జోన్‌లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేసి ప్రారంభించే విధంగా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి

పరిశ్రమల ఏర్పాటుకు వ్యాపారులు ముందుకు రావాలి. ఇప్పటివరకు ఇద్దరు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. పరి శ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తే పూర్తిస్థాయిలో అన్ని సౌక ర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. ఫుడ్‌జోన్‌లో పరిశ్రమల ఏర్పాటుకు రహదారులు, విద్యుత్ లైన్‌లను ఏర్పాటు చేశాం. వ్యాపారులు దరఖాస్తులు చేసుకుంటే త్వరగా అందుబాటు లోకి తీసుకువస్తాం.

- పద్మజ, ఫుడ్ జోన్ జోనల్ మేనేజర్

గిరిజన సంప్రదాయాలను కాపాడేది ఆదివాసీలే

కాకో ఆలయంలో ప్రారంభమైన దండారీ ఉత్సవాలు



పద్మల్‌పూరీ కాకో ఆలయంలో పూజలు చేస్తున్న తిరుపతి, పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

దండేపల్లి, అక్టోబరు 6: గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడేది ఆదివాసి గిరిజనులేనని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌లు అన్నారు. గుడిరేవు గోదావరి నది ఒడ్డున పద్మల్‌పూరీ కాకో ఆలయంలో ఆదివారం దండారీ ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద ఎతైమాల్ పేన్ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసి గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం పద్మల్‌పూరీ కాకో అమ్మవారికి యేటా దసరా ముందు గోదావరి పుణ్యస్నానం ఆచరించి ఐదు రోజుల పాటు పూజలు చేస్తారన్నారు. కొత్త ధాన్యంతో కాకో అమ్మవారికి నైవేద్యం వండి సమర్పించారు. అనంతరం గిరిజనులతో సమావేశం నిర్వహించి దండారీ ఉత్సవ వేడుకలపై చర్చించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కుడిమేత సోముపటేల్, రాయిసెంటర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఆలయ నిర్వాహకులు లింగారావు, కాంతరావు, లచ్చుపటేల్, జంగు, గోపి, నరేందర్, తిరుపతి పాల్గొన్నారు.

ఎరుకల కులస్తుల సమస్యలను పరిష్కరించాలి



చెన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎరుకల సంఘం నాయకులు

చెన్నూరు, అక్టోబరు 6: ప్రభుత్వం ఎరుకల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర సలహాదారులు శ్రీరాములు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, లోకిని రాజు, రేవెల్లి రాజలింగు, రమేష్‌లు పేర్కొన్నారు. ఆదివారం చెన్నూరులో ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎరుకల కులస్తులు అధికంగా ఉన్నారని, వీరు విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయంగా వెనకబడి ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీం కింద పందులను పెంచుకోవడానికి ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని కోరారు. ఇల్లు లేని వారికి ఇండ్లు మంజూరు చేయాలన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో ఏకలవ్య కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. సమ్మయ్య, సుభాష్, రాము, రవి, పోశం, సారయ్య, సమ్మయ్య, సాయిలు, పోచం, రమేష్, పోశం, పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మందమర్రిటౌన్, అక్టోబరు 6: పట్టణంలోని కేకే1 డిస్పెన్సరీలో ఆదివారం మహిళ ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. మహిళ ఉద్యోగులు మాట్లాడుతూ బతుకమ్మ అంటేనే పూల పండగ అని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక అని పేర్కొన్నారు.

మాదిగలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 6: మాదిగలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని చార్వాక హాలులో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన వెంటనే రాష్ట్రంలో అమలు చేస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ కార్యాలయాలను ముట్టడిస్తామని, ఇందులో భాగంగా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో ముట్టడి కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. నాయకులు అశోక్ మాదిగ, అంజన్న మాదిగ, సతీష్ మాదిగ, బలక్క మాదిగ, శంకర్ మాదిగ, సారంగం మాదిగ, రమేష్ మాదిగ, సుగుణాకర్‌మాదిగ, ఉదయ్‌కిరణ్, విష్ణు, ఫ్రాన్సిస్, ఆదిత్యలక్ష్మణ్ మాదిగలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దండేపల్లి, తాండూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దండేపల్లి, అక్టోబరు 6: దండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25 ఏళ్ల క్రితం విద్యనభ్యసించిన వారు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మే ళనంతో ఒకచోట కలిశారు. 1998-99లో పదో తరగతి చదివి వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో, వ్యాపార రంగాల్లో, రాజకీయ రంగాల్లో స్థిరపడ్డారు. ఉన్నత పాఠశాలలో అందరూ కలిసి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉత్సాహంగా గడిపారు. అనాటి ఉపా ధ్యాయులను సన్మానించారు. ఉదయం నుం చి సాయం త్రం వరకు ఆటా పా టలు, నృత్యాలతో సందడి చేశారు.

తాండూర్: తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998-99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం తాండూర్ ఐబీలో ఘనంగా నిర్వహించారు. ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలుకరించుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు సంగర్సు రామ్మోహన్‌రావు, సూర్య ప్రకాష్‌రావు, గంగా మురళీధర్‌రావు, పుల్లూరి శంకర్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

భీమారం, అక్టోబరు 6: మండలంలోని ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన యువకులకు ఆదివారం చెన్నూరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఇలియాజుద్దీన్ వాలీబాల్, క్రికెట్ కిట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాకా వెంకటస్వామి జ్ఞాపకార్థం క్రీడా సామగ్రి అందించినట్లు తెలిపారు. క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభ చాటాలని కోరారు. నాయకులు సూరం రాజశేఖర్, ఆవిడపు రవితేజ, మంతెన సమ్మయ్య, సృజన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు

చెన్నూరు, అక్టోబరు 6: చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ బాల్క సుమన్ ఓటమి చెందడంతో మతిభ్రమించి మరికొద్ది రోజుల్లో బై ఎలక్షన్‌లు వస్తాయని, తాను గెలుస్తానని మాట్లాడుతున్నాడని తెలిపారు. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. నాయకులు సూర్యనారాయణ, మహేష్ తివారీ ప్రసాద్, శ్రీధర్, నాగరాజు, అన్వర్, సుల్తాన్, మహేష్, సుధాకర్‌రెడ్డి, సుఖేందర్, అన్వర్ పాల్గొన్నారు.

రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా రాజు

చెన్నూరు, అక్టోబరు 6 : మండలంలోని రాయిపేట గ్రామానికి చెందిన గండు రాజు బీసీ సంఘం రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతులమీదుగా ఆదివారం రాజు నియామకపత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో సుధాకర్, కృష్ణ, జనార్దన్ పాల్గొన్నారు.

మాదిగ సంఘం మండల కార్యర్గం

జన్నారం, అక్టోబరు 6 : జన్నారం మండల మాదిగ సంఘం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండుకురి ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శిగా జంగం రవి, ఉపాధ్యక్షులుగా బచ్చల కృష్ణ, రాజు, కోశాధికారిగా రాజేష్, ప్రచార కార్యదర్శిగా రమేష్, సంయుక్త కార్యదర్శిగా చంద్రయ్య, సలహాదారులుగా దుబ్బయ్య, రాజేష్‌లను ఎన్నుకున్నారు.

ప్లంబర్ కుటుంబానికి చేయూత

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 6 : తోటి ప్లంబర్ వాజీద్ ఖాన్ అనారోగ్యంతో మృతి చెందగా ప్లంబర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.5వేలతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. అధ్యక్షుడు పొట్టాల మల్లేష్, ప్రధాన కార్యదర్శి అట్ల అంజనేయులు, ఉపాధ్యక్షుడు చెలమటికారి రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

టూ వీలర్ మెకానిక్స్ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 6 : మంచిర్యాల పట్టణ టూ వీలర్ మెకానిక్స్ అండ్ వర్కర్స్ సొసైటీ కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్ణకంటి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా రామగిరి శ్రీనివాస్, కోశాధికారిగా ఎండి.అన్వర్, ఉపాధ్యక్షులుగా మడుపు శ్రీనివాస్ చారి, పుట్ట కుమార్, ఎండి.ఫర్వీజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిలుకూరి శ్రీనివాస్ చారి, కార్యదర్శులుగా ప్రతాప్, విజయ్, రాజు, శ్యామ్, సుధాకర్, సురేందర్, శ్రీనాథ్ గౌడ్‌లను ఎన్నుకున్నారు. మెకానిక్‌ల సంక్షేమానికి కార్యవర్గం పనిచేస్తుందని సభ్యులు తెలిపారు.

కవ్వాల్ టైగర్ జోన్‌లో సైక్లింగ్



సైక్లింగ్‌లో పాల్గొన్న సైక్లిస్టులు

జన్నారం, అక్టోబరు 6 : వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కవ్వాల్ టైగర్ జోన్‌లో ఫారెస్టు అధికారులు నిర్వహించిన సైక్లింగ్‌లో వివిధ జిల్లాలకు చెందిన సైక్లిస్టులు పాల్గొన్నారు. తాళ్లపేట రేంజ్ నుంచి సైక్లింగ్‌ను ప్రారంభించారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిర్మల్, హైద్రాబాద్ జిల్లాలకు చెందిన 30 మంది సైకిల్ క్లబ్ సభ్యులు హాజరయ్యారు. ఉదయం 5 గంటల నుంచి తాళ్లపేట ఫారెస్టులోని అల్లాద్రి నుంచి ఊట్ల వరకు సుమారు 20 కిలోమీటర్ల టైగర్ జోన్‌లోని బఫర్ ఏరియాలో సైక్లింగ్ కొనసాగించారు. సైక్లింగ్ చేపట్టడం ఎంతో ఆహ్లాదంగా అనిపించిందని సైక్లిస్టులు పేర్కొన్నారు. ఇందన్‌పల్లి రేంజ్ ఆఫీసర్లు సుష్మారావు, హఫీజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో జవాన్ల సేవలు వెలకట్టలేనివి



ఆర్మీ జవాన్‌ను సన్మానిస్తున్న నాయకులు

బెల్లంపల్లి, అక్టోబరు 6: దేశ రక్షణలో జవాన్ల సేవలు వెలకట్టలేనివని బెల్లంపల్లి హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోడి రమేష్ అన్నారు. ఆదివారం 28వ వార్డులోని దుర్గామాత మండపం వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకుడు బొంతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో దేశం కోసం సేవలందిస్తున్న ఆర్మీ జవాన్ గుండ శ్రీనివాస్‌ను సన్మానించారు. వారు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం అహర్నిషలు నిద్రాహారాలు మాని విధులు నిర్వహిస్తారన్నారు. బస్తీవాసులు సదానందం, కృష్ణ, అభిలాష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయడంలో యువత ముందుండాలి



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు

బెల్లంపల్లి, అక్టోబరు 6: రక్తదానం చేయడంలో యువత ముందుండాలని శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తుమ్మల సురేష్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి రాహుల్‌లు పేర్కొన్నారు. ఆదివారం సొసైటీ ఆధ్వర్యంలో సింగరేణి ఏరియా ఆసుపత్రిలో రక్తదానం శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పేర్కొన్నారు. శిబిరంలో 70 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించామన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. సొసైటీ సభ్యులు రాజశేఖర్, సత్యనారాయణరెడ్డి, మహ్మద్ అక్బర్, సంతోష్, మల్లేష్, కిరణ్, సాగర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ బాధ్యులు మోహన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ



ధర్మారావుపేటలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

కాసిపేట, అక్టోబరు 6: మండలంలోని ధర్మారావుపేట, కొండాపూర్, తాటిగూడెం, కోనూరు, లంబాడితండా(డీ) గ్రామాల్లోని మహిళలకు కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు రుక్మిణి, పద్మజ, రోజమ్మలు మాట్లాడుతూ కొన్నేండ్లుగా ట్రస్టు ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ, మాజీ ఎంపీటీసీ పర్వతి మల్లేష్, నాయకులు శేఖర్‌రావు, శ్రీనివాస్, సాకేత్, రవి, చారి, శంకర్, చంద్రయ్య, సది తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత మహా సంకల్పయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న వనిత వాక్కు ఫౌండేషన్ సభ్యులు

గర్మిళ్ల, అక్టోబరు 6: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని వనిత వాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 108 కలశాలతో దుర్గామాత మహా సంకల్పయాత్రను నిర్వహించారు. విశ్వనాధ ఆలయం నుంచి ఐబీ చౌరస్తా వరకు యాత్రను నిర్వహించారు. అనంతరం అమ్మవారి అభిషేకం, లలిత సేవా సమితి వారిచే దుర్గామాత అష్టోత్తర శతనామావళి పారాయణం, అనంతరం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సైకాలజిస్టు రంగు వేణుకుమార్, ఫౌండర్స్ కవిత, కుర్మ సునీత, జ్యోత్స్నచంద్రదత్, చందన, మంజుల, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

రామకృష్ణాపూర్, అక్టోబరు 6: ఆర్కే 1, మార్కెట్ ఏరియాలో కొలువుదీరిన దుర్గా మాతను ఆదివారం చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దర్శించుకొన్నారు. ఆయన మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షిం చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

బెల్లంపల్లి, అక్టోబరు 6: పట్టణంలోని టేకులబస్తీలో ఆదివారం బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని తెలిపారు. నాయకులు రాచర్ల సంతోష్, దార కళ్యాణి, మద్దెల శ్రీనివాస్, ప్రశాంత్,నర్సింగ్, పాల్గొన్నారు.

కాసిపేట: దేవాపూర్‌లో బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు సూరం సంపత్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, మోదీ పథకాలకు ఆకర్షితులై ప్రజలందరు బీజేపీలో పెద్ద సంఖ్యలో సభ్యత్వం తీసుకుంటున్నారని తెలిపారు. బాలరాజు, అనిత తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ అన్నారు. లంబాడితండాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అందరు 8800002024కు మిస్‌కాల్ ఇచ్చి సభ్యులుగా చేరాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, నాయకులు కేశవరెడ్డి, ఆజ్మీర శ్రీనివాస్, దూది ప్రకాష్, శ్రావణ్, రాములు పాల్గొన్నారు.